విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఇండియా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-పెడన : ఇండియా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు పిలుపునిచ్చారు. గురువారం కప్పలదొడ్డి అరుణశ్రీ సొసైటీలో సీపీఐ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అద్దాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా పెడన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శొంఠి నాగరాజు, పార్లమెంట్ అభ్యర్థిగా గొల్లు కృష్ణ లను గెలుపు కోసం పార్టీ నాయకులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరిశెట్టి ఉమాకాంతం, తుమ్మ చిన్న కొండయ్య, పీతాంబరధరరావు, చిన్మయలింగం, సోమేశ్వరరావు, ఉక్కుమ్ గంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కొడాలి నామినేషన్

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ తాజా మాజీ శాసనసభ్యులు కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు నామినేషన్ కోలాహలంగా జరిగింది. గురువారం స్థానిక శంకరమఠం లో ప్రత్యేక పూజలు నిర్వహించి రాజేంద్రన గర్‌లో తన ఇంటికి చేరుకున్న కొడాలి నానికి భార్య కుమార్తెలు హారతులు ఇచ్చి నామినేషన్ ర్యాలీకి బయలుదేరారు. రైతులు ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండి మీద ర్యాలీగా బయలుదేరే ముందు తల్లికి పాదాభివందనం చేసి ఆశీర్వచనం తీసుకుని మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి డా॥ సింహాద్రి చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, పెడన వైసిపి అభ్యర్థి ఉప్పాల రాములతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరాగా ర్యాలీగా ఏలూరురోడ్డు, నెహ్రూచౌక్, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డ మీదుగా స్థానిక అర్.డి.ఓ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి పద్మావతికు నామినేషన్ పత్రాలను అందించారు. కొడాలి నాని సోదరుడు కొడాలి నాగేశ్వరరావు (చిన్ని) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనాయకులు గొర్ల శ్రీను, పెయ్యిల ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

కైలే అనిల్ కుమార్..

విశాలాంధ్ర-కూచిపూడి : పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ కార్యక్రమానికి గురువారం మొవ్వ మండలంలోని 21 గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటిసి రాజులపాటి పార్వతి, మండల శాఖ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, వైస్ ఎంపీపీలు కందుల వెంకట కోటేశ్వరరావు, డొక్కు వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్ళు, చినముత్తేవి పిఏసిఎస్ అధ్యక్షులు కాకర్ల శివకుమార్, కాజ ఉప సర్పంచ్ మంద శ్రీనివాస్ రెడ్డి, కూచిపూడి సర్పంచ్ భర్త కొండవీటి అమరబాలేశ్వరరావు వెళ్లారు.

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోయిన బుద్ధప్రసాద్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అవనిగడ్డ తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి బాల బ్రహ్మ హ్మణ్యంకు గురువారం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోయిన బుద్ధప్రసాద్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

జంపింగ్ నాయకుల మాయాజాలం!

ఎన్నికల సీజన్ వచ్చేసింది. వలస పక్షుల హవా పెరిగింది. నిన్న మొన్నటి వరకు శూరుడు, ధీరుడు అన్న నాయకుడు తరువాత రోజుకి పనికిరాకుండా పోతున్నాడు. అవసరం తీరితే చాలు ఎంతటి వారినైనా వదిలేయడం వీరి లక్షణం. నాలుగు కాసులు వెనకేసుకొనేందుకు పార్టీలు మార్చే వారి సంఖ్య రోజుకి పెరిగిపోతోంది. నిన్న ఓ నాయకుడితో ఫొటో.... నేడు మరొక నాయకుడితో. ఇది ప్రస్తుతం జరుగుతున్న జంపింగ్ జపాంగుల జిమ్మిక్కులు. ఎన్నికల సమయం కావడంతో ఎవరు వచ్చినా కాదనకుండా నాయకులు కూడా కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్నారు. అన్ని పార్టీలలో ఇదే తంతు ప్రస్తుతం కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనల పరిధిలోకి ఇవేవీ వచ్చే అవకాశం లేకపోవడంతో మూడు చేరికలు.. ఆరు గుడ్ బైలు అన్న చందంగా వలస పక్షుల వాతావరణం కొనసాగుతుంది.

-పార్టీలకంటే స్వప్రయోజనాలే ముఖ్యం
-అన్ని పార్టీల్లోనూ గోడమీద పిల్లులు
-తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు, పార్టీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జిల్లాలో ఓ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరుడు. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఎమ్మెల్యేతో తిరిగి నాలుగు రాళ్లు వెనకేసుకున్నాడు. పనులన్నీ చేయించుకున్నాడు. ఎన్నికల సమయం రావడంతో ఓ మంచి ముహూర్తం చూసుకొని తనకు పార్టీలో గుర్తింపు లేదనే సాకుతో ప్రతిపక్ష పార్టీ నాయకుల వద్దకు వెళ్లి కండువా కప్పించుకున్నాడు. ఇప్పటివరకు ఇష్టపడిన నాయకుడు ఒక్కరోజులోనే ఎందుకు కష్టమైపోయాడో ప్రజలకు అర్థం కావడం లేదు. గత ఐదేళ్లుగా ప్రతిపక్ష అభ్యర్థి వద్ద ఉంటూ ఆ పార్టీలో కొనసాగుతున్న మరో వ్యక్తి ఎన్నిక సమయం రావడంతో ఉన్నట్లుండి అధికార పార్టీలోకి జంప్ చేశారు. పార్టీ మార్చి కొత్త జెండాకు జై కొట్టేశారు. అప్పటివరకు ఆయనతో పాటు తిరిగిన అనుచర గణానికి, పార్టీ సిద్ధాంతాలు పాటించేవారు ఆయనతో పాటు వెళ్లాలా...? వద్దా..? అన్న డైలమాలో పడిపో యారు. ప్రస్తుత ఎన్నికల వాతావరణంలో ఎక్కడ చూసినా వలస పక్షుల హవా కొనసాగుతోంది. గోడమీద పిల్లుల రాజ్యం జరిగిపోతుంది. వీటన్నింటి వెనుక ప్రధాన కారణం ఆర్థిక నేపథ్యమేనన్నది బహిరంగ రహస్యమే.

విధేయతకు చెల్లు చీటీ....

గత రెండు మూడు దశాబ్దాల క్రితం రాజకీయ వాతా వరణం పరిశీలిస్తే పెద్ద నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు అయితే నేమి తమ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా పార్టీలోనే కొనసాగుతూ సిద్ధాం తాలకు ప్రాణం ఇచ్చేవారు. ఇటువంటివారు అన్ని పార్టీలలోనూ ఉండేవారు. అయితే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. ఇప్పుడంతా అవసరార్థం వచ్చే నాయ కులతో అన్ని పార్టీలు నిండిపోతున్నాయి. నాయకులు కూడా వీరికన్నా నాలుగాకులు ఎక్కువే చదువుకు న్నారు. వారు కూడా అవసరం ఉన్నంతసేపు ఒక పార్టీలో ఉండటం.. అవసరం తీరిన తరువాత పార్టీలో గుర్తింపు లేదు.. మనసుకు బాధ కలిగించారు అన్న కుంటి సాకులతో పార్టీలకు గుడ్ బై చెప్పేస్తున్నారు. కొత్త పార్టీలో చేరిపోయి కండువాలు కప్పుకుంటూ చిందులేస్తున్నారు. ప్రస్తుతం హవా కలిగి ఉన్న ఎన్ని కల సర్వే రిపోర్టుల ప్రకారం ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో స్వీయ అంచనా వేసుకోవడం.. తమ పార్టీ నాయకుడి మీద ధ్వజమెత్తడం పక్క పార్టీలో చేరి పోవడం ఇదే తంతు కొనసాగుతోంది. గతంలో ఓ పార్టీలోనే దశాబ్దాల తరబడి విధేయతను ప్రకటించిన నాయకులు ఎంతోమంది ఉండేవారు. ప్రస్తుతం పార్టీ విధేయత అన్నది ఎక్కడా కానరావడం లేదు.

ఆర్థిక ప్రయోజనాలే పరమావధి

ప్రస్తుతం ఆ పార్టీలో నుంచి ఈ పార్టీలోకి... ఈ పార్టీలో నుంచి ఆ పార్టీలోకి వెళ్లే వారి పరమా వధి ఆర్థిక ప్రయోజనాలే అన్నది బహిరంగ రహ స్యం. అభ్యర్థి ఆర్థిక బలాబలాలను బట్టి ఎంత వరకు మనం వసూలు చేసుకోవచ్చు, ఎంత మిగుల్చుకోవచ్చు అనే అంచనాలతో పార్టీలు జంప్ చేయడం, తమ బలం కొంతే అయినా రెట్టింపు చూపించుకోవడం ఆర్థిక ప్రయోజనాలు పొందడం పరిపాటిగా మారిపోయింది. అభ్యర్థు లు కూడా తప్పనిసరై వస్తున్న వారికి స్వాగతం పలకా ల్సిన పరిస్థితి. లేనిపక్షంలో మీడియా పరంగా తమ పార్టీలోకి చేరే వారి సంఖ్య తగ్గిపోతుందని వార్తలు వస్తే గ్రాఫ్ తగ్గిపోతుందేమో నన్న భయం వెంటాడు తోంది. కొంతమంది అభ్యర్థులు అయితే సొంత పార్టీలోనే క్రియాశీలకంగా లేని వారిని గుర్తించి స్టేజీల పైకి పిలిచి కండువాలు కప్పి అవతల పార్టీలో నుంచి వచ్చారంటూ ప్రచారం చేసుకోవడం కూడా విస్మయాన్ని కలిగించేదే. ఇదే విషయాన్ని ఓ ద్వితీయ శ్రేణి నాయకుడ్ని అడిగితే.. పెద్ద స్థాయి నాయకులకు లేని సిగ్గు మాకెందుకంటూ చెప్పడం గమనార్హం. తాము రాజకీయాలలో తిరగాలంటే ఏదో ఒక రకంగా సంపాదించుకోకపోతే కుటుంబ సభ్యులు ఒప్పుకోరం టూ ఆ నాయకుడు అనడం విశేషం. మొత్తానికి ఎన్ని కల సీజన్లో వలస పక్షుల జోరు కొనసాగుతోంది.

రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జూనియర్ అకౌంటెంట్

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : జిల్లా ఖజానా కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ ప్రసాద్ గురువారం రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా చేస్తూ మరణించిన అమీర్ భార్య షాజహాకు కారుణ్య నియామకం కింద మూడు నెలల క్రితం ఉద్యోగం ఇవ్వగా, మూడు నెలల నుండి జీతం రాకపోవడం బిల్లుల కోసం ట్రెజరీ ఉద్యోగి నాగేశ్వర వరప్రసాద్ ను సంప్రదించగా, అతను రూ.10 వేలు డిమాండ్ చేశాడు. గత్యంతరం లేని స్థితిలో, షాజహా ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ఏసీబీ ఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో దాడిచేసి ప్రసాద్ రూ.10 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయంపై ఏఎస్పీ పి స్నేహిత మాట్లాడుతూ, వరప్రసాద్‌పై గతంలో కూడా ఫిర్యాదులు వచ్చాయని, చనిపోయిన అమీర్ కుటుంబానికి ఎరియర్స్ రూ.9లక్షలు ఇచ్చే క్రమంలో కూడా ప్రసాద్ డబ్బులు అడిగాడని, అమీర్ కుటుంబ సభ్యులు రూ.4 వేలు మాత్రమే ఇవ్వడంతో పెండింగ్‌లో పెట్టాడని, కారుణ్య నియామకం క్రింద డ్యూటీలో జాయిన్ అయిన షాజహా మూడు నెలల జీతం బిల్ పాస్ చేయడానికి రూ.10 వేలు లంచం అడగడంతో షాబాను తమను సంప్రదించిందని, ఆమెఫిర్యాదు మేరకు ప్రసాద్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని అన్నారు.

ప్రజా సంక్షేమానికి కమ్యూనిస్టులు బలపరచిన పార్టీనే గెలిపిద్దాం

విశాలాంధ్ర-పెనమలూరు : ప్రజా సంక్షేమానికి కమ్యూనిస్టులు బలపరచిన పార్టీనే గెలిపిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి టి తాతయ్య పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 11 గంటలకు సీపీఐ, సీపీఎం బలపరిచిన పెనమలూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలసిల సుబ్రహ్మణ్యం నామినేషన్ కార్యక్ర మంను ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యాన్ని అధిక మెజార్టీతో గెలిపించాలని కానూరు సెంటర్ నుండి పోరంకి పెనమలూరు సెంటర్ మీదగా పెనమలూరు ఎమ్మార్వో కార్యాలయం దగ్గరికి ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం వి సుబ్రహ్మణ్యం తన నామినేషన్ పత్రాలను తహశీల్దార్‌కు సమర్పించారు. ఈ ప్రదర్శనలో సీపీఐ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు వెలగపూడి అజాద్, పెనమలూరు నియోజకవర్గం కార్యదర్శి మున్నంగి నరసరావు, చిన్నోగిరాల కార్యదర్శి ఎం రాధాకృష్ణ, ఉప్పులూరు సీపీఐ కార్యదర్శి పి నాగేశ్వరరావు, పెనమలూరు గ్రామ శాఖ కార్యదర్శి వి బాలస్వామి, యనమలకుదురు గ్రామ శాఖ కార్యదర్శి ఇజ్రాయిల్ ఏఐటీయూసీ పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మహేష్ రైతు సంఘం నాయకులు వై వెంకటేశ్వరరావు ఈ ప్రదర్శనలో సీపీఎం నాయకులు త్రిమూర్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు దనేకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్టానికి మళ్లీ సీఎం జగనే : వంశీ

విశాలాంధ్ర-గన్నవరం : రాష్టానికి మళ్ళీ సియం జగన్ మోహన్ రెడ్డి వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. వేలాది జనప్రభంజనంతో దావాజిగూడెం రోడ్డులోని ఆయన నివాసం నుండి బయలుదేరి ర్యాలీగా వెంకటేశ్వర థియేటర్ మీదుగా గాంధీబొమ్మ సెంట వరకు వచ్చి గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ ప్రజలు మళ్ళీనన్నే గెలిపిస్తాని అన్నారు. చంద్రబాబు మీద రాష్ట ప్రజలు నమ్మరని విమర్శించారు. 14 ఏళ్ళు సియం చేసి పేద ప్రజలకు చెప్పుకోవడానికి ఒక్క పథకం కుడాలేదని అన్నారు. చంద్రబాబు ఎన్నికల తరువాత తెలుగు దేశం పార్టీని బీజేపీలో విలీనం చేస్తాడని అన్నారు.గన్నవారాం ప్రజలు సేవా చేసే వారిని గెలిపిస్తాని అన్నారు.ఈ కార్యక్రమంలో గొలుసులు శివభారత్ రెడ్డి ,దంపతులు వంశీమోహన్ సతి మణి పంకజాశ్రీ మాజీ సర్పంచి నీలం బాలు, తోట వెంకయ్య, కొమ్మ కోట్లు, ఎలిజబెత్ రాణి,,మాజీ సర్పంచి రాము మాజీ సర్పంచి కసరనేని గోపాలరావు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్లకు అవకాశం ఇవ్వండి: చలసాని

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ బిజెపి జనసేన పార్టీల కూటమి అభ్యర్థి వర్ల కుమార్ రాజాకు ఒక్క అవకాశం కల్పించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించే భాగంగా సూపర్ సిక్స్ పథకాలతో పాటు మహిళలకు అనేక రకాల సంక్షేమ పథకాలను కలిగిన బ్రోచర్లను ప్రతి ఇంటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగిందని రమేష్ చౌదరి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, రాచూరి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటున్ను, కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం, మెరకనపల్లి కాపురస్తుడున్నూ అయిన **ఆకుల వెంకట రవితేజ, తండ్రి హిమగిరిబాబు గారి** సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది.

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ డోర్ నెం. 61-8/7-2, కృష్ణలంక కాపురస్తులైన **వల్లారపు శ్రీదేవి, భర్త వెంకట నాగ నరసింహారావు గారి** నుండి కొనుగోలు చేయుటకు విక్రయ అగ్రిమెంటు పొందియున్నారు. సదరాస్తిని **వల్లారపు శ్రీదేవి** గారికి వారి తండ్రిగారైన **యర్రంశెట్టి పూర్ణ చంద్రశేఖర వరప్రసాద్, తండ్రి పార్థసారథి గారు ది. 17-11-2011వ** తేదీన అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసునందు దస్తావేజు **నెం.3019/11**గా రిజిష్టరు చేయించి మరల **ది. 22-4-24వ** తేదీన చల్లపల్లి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో దస్తావేజు **నెం.3703/24**గా నవరణ చేసి దఖలు పరచియున్నారని ఆ విధముగా షెడ్యూలు ఆస్తివారి స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నదని తెలియచేయుచున్నారు. కావున ఎవరికైనను సదరాస్తిపై ఏ విధమైన అభ్యంతరములు, జప్తులు, క్లయిములు వగైరాలు ఉన్నయెడల నేటినుండి వారం రోజులలోపు నా క్లయింటు అడ్రసుకు, లేక నా అడ్రసుకు రిజిష్టరు పోస్టుద్వారా తెలియ చేయగలరు. లేనిచో సదరాస్తి నిర్వివాదమైనదిగా భావించి, నా క్లయింటు యావత్తు క్రయధనము చెల్లించి క్రయ దస్తావేజు పొందగలరని తెలియచేయటమైనది.

షెడ్యూలు

1వ అయిటం: కృష్ణాజిల్లా, శ్రీ అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, మోపిదేవి మండలం, మేకమర్తిలంక గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన చెందిన మేకమర్తిలంక గ్రామం తాలూకు ఆర్.సర్వే నెం.26/1ఎ దాఖలా యం.-90ట్లు భూమికి హద్దులు : **తూర్పు :** యార్లగడ్డ కృష్ణమూర్తి వగైరాల భూమి, **దక్షిణం :** రోడ్డు, **పడమర :** యార్లగడ్డ కృష్ణమూర్తి వగైరాలు భూమి, **ఉత్తరం :** ఏటిపుంత.

ఈ నాలుగు హద్దుల మధ్య **యు.0-90 సెంట్లు** లేక హె.**0-364**ర్ల స్థిరాస్తి శేరీపల్లం భూమి

2వ అయిటం: కృష్ణాజిల్లా, శ్రీ అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, మోపిదేవి మండలం, మేకమర్తిలంక గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన మేకమర్తిలంక గ్రామం తాలూకు ఆర్.సర్వే నెం.**25/2బి** 2రు దాఖలా **యు.1.00**ట్లు భూమికి హద్దులు : **తూర్పు :** యార్లగడ్డ సత్యనారాయణ భూమి, **దక్షిణం:** రోడ్డు, **పడమర :** యార్లగడ్డ సత్యనారాయణ భూమి, **ఉత్తరం :** పంటబోదె.

ఈ నాలుగు హద్దుల మధ్య **యు.1-00 సెంట్లు** లేక హె.**0-407**ర్లు స్థిరాస్తి శేరీ పల్లం భూమియున్న వెరశి పై **1,2** అయిటంల దాఖలా మొత్తం **యు.1-90**సెంట్లు లేక హె.**0-768**ర్లు, స్థిరాస్తి శేరీపల్లం భూమియున్నూ అన్ని హక్కులతో సహా.

చందు నాగరాజు, అడ్వకేట్,
డోర్ నెం. 27-20-16, 1వ అంతస్తు, సివిల్ కోర్టు దగ్గర, మ్యూజియం రోడ్డు, గవర్నరుపేట, విజయవాడ-2. సెల్ : 9440327326.
విజయవాడ, తేది : 24-4-24

ప్రకటన

నా క్లయింటు అయిన ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, భవానీపురం, డోరు నెం. 76-7-12/1 కాపురస్తులు **తదికమళ్ళ రమేష్** గారి కుమారుడు **వెంకట నాగ ఆదిత్య** యిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా..

యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి అనగా విజయవాడ రూరల్ మండలం, ఫిర్యాదినైనవరం కాపురస్తులు **కోటా దావీదు** గారి కుమారుడు **కోటా మోషే** గారి వద్ద నుండి క్రయం పొందుటకు నిర్ణయించుకొని, కొంత సొమ్మును అడ్వాన్సుగా చెల్లించి మిగతా క్రయధనం చెల్లించుటకు సిద్ధముగా యున్నారు. నా క్లయింటు పేరున గాని, లేదా వారు కోరిన వారి పేరున గాని క్రయ దస్తావేజు వ్రాయించి రిజిష్టరు చేయించుకొనుటకు యగ్రిమెంటై యున్నారు. సదరు **బాదిత అర్జునరావు, సిరుగుడి మెహర్ శంకర్, కొప్పిశెట్టి శ్రీనివాసరావు** గారలు షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 28-04-2021**న **భైరవభొట్ల వెంకట లీలారాణి, భైరవభొట్ల రాంబాబు** గారలవద్ద నుండి క్రయం పొంది, నున్న సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో **దస్తావేజు నెం. 1498/2021** రుగా రిజిష్టరు విక్రయ దస్తావేజుగా నమోదు కాబడిన ఆస్తియై యున్నది. యిందు మూలముగా తెలియజేయునది ఏమనగా సదరు ఆస్తిపై గాని, సదరు విక్రయమునకు సంబంధించి గాని ఎవరికైనా అభ్యంతరములు గాని, క్లయిమ్స్ గాని, కోర్టుజప్తులు గాని, అవిభాజ్యపు హక్కులు గాని వున్న యెడల యీ ప్రకటన వెలువడిన ఏడు రోజులలోపు యీ క్రింది చిరునామాకు తగిన ఆధారాలతో రిజిష్టరు పోస్టు విత్ తిరిగి రశీదు ద్వారా తెలియజేయగలరు. గడువు తేది లోపు యెట్టి అభ్యంతరములు రాని యెడల షెడ్యూలు దాఖలా ఆస్తి నిర్వివాదమైన ఆస్తిగా యెంచి నా క్లయింటు క్రయ దస్తావేజు రిజిష్టరు చేయించుకోగలవాడని యావన్మందికి తెలియజేయడమైనది. గడువు తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండ్ చేయజాలవు.

షెడ్యూలు :ఎన్.టి.ఆర్.జిల్లా, నున్న సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన అంబాపురం గ్రామ ఆర్.యస్.నెం. 31/6సి, ప్లాటు నెం. 7 రు దాఖలా చ.గ. 248 - 0లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు:
తూర్పు : అ.30-0లు వెడల్పు గల రోడ్డు. అ.36-0లు, **దక్షిణం :** ప్లాటు నెం. 8 రు దాఖలా ఆస్తి.అ. 62-0లు, **పడమర :** జూటూరి నాగేశ్వరరావు గారు యితరులకు విక్రయించిన ఆస్తి. అ. 36-0లు., **ఉత్తరం :** ప్లాటు నెం. 6 రు దాఖలా ఆస్తి. అ.62-0లు యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 248 - 0లు లేక చ.మీ. 207 - 36ర్లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము మాత్రము. యావత్తు యీజ్మెంటు హక్కులతో సహా.

P.Indira, Advocate, B.Com. B.L.,
1-4/5-31, Parchasaradhi Street, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-12.
Cell : 7893182691

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 259 of 2022

Between:
PAVITRA CHIT FUND PVT.LTD. Vijayawada, rep. by It's Foreman & Managing Director
Chigurupati Nageswara Rao - **DISPUTANT**
AND
Machipalli Murali and others - **OPPONENTS**

To,
1) Machipalli Murali, Son of Balaiah, C/o. Turning Shoes, Ramachandra Rao Peta, Eluru, West Godavari District.
2) Machipalli Bala Raju, Son of Bla Guravaiah, Prop of M/s. Turning Shoes, Ramachandra Rao Peta, Government Hospital Road, Eluru, West Godavari District.
3) Machipalli Guravaiah, Son of Bala Guravaiah, Prop. Friends Shoe Mart, Resident of D.No.12-1252, Road No. 12, Mahanadu, Tadepalli Post, and Mandal, Guntur District.
4) Sagaraboina Sreenu, son of Chinnaiah, Resident of D.No.12-1159/2, 10th Line, Sundaraiah Nagar, Tadepalli, Guntur District. **(Opponents No.1 to 4)**

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **28-05-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on **28-05-2024 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

A. PRASOON KUMAR, Advocate, D.No.25-104, F2, Sri Chakra Apartment-7 Yanamalakuduru, Vijayawada-7
Date of Adjournment: 28-05-2024.

సీపీఐ నాయకులు నాగయ్యకు మాతృవియోగం

విశాలాంధ్ర-ఘంటసాల: చేనేత సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కోదాటి నాగయ్య మాతృమూర్తి కోదాటి కృష్ణకుమారి (85) అనారోగ్యంతో ఘంటసాల తన నివాసంలో మృతి చెందారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి గుత్తికొండ రామారావు (రాము), రాష్ట్ర రైతు సంఘం నాయకులు హనుమనుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆమె మృతదేహానికి ఘన నివాళులర్పించారు. కృష్ణకుమారికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు

మలేరియాపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కోడూరు : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కోడూరు గ్రామం నందు గల ప్రాథిమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం డా.వివేక్ ఆధ్వర్యంలో మాలేరియా వ్యాధిపై అవగహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.వివేక్ మాట్లాడుతూ ప్రపంచ మాలేరియా దినోత్సవం ఏప్రియల్ 25వ తేదిన ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరంనిర్వహిస్తారు. ఈ వ్యాధి పట్ల అవగహన, నిర్మూలన మాలేరియా దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని, ప్రపంచ వ్యాప్తంగా 106 దేశాల్లో 3.3 బిలియన్ ప్రజలు మాలేరియా వ్యాధి బారీన పడి భాధలు పడుతున్నారు అని 2012 సంవత్సరంలో మాలేరియా వ్యాధి బారీన పడి 6,27,000 ప్రజలు మరణించారు వారిలో అధికంగా ఆఫ్రికన్ పిల్లలు ఉన్నారు .కావున ముఖ్యంగా ఈ వ్యాధి దోమకాటు వలన వస్తుంది అని మన చుట్టు ప్రక్కన గల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి జ్వరం,వికారం,వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులుని సంప్రదించాలి అని తెలియచేసారు. ఈ కార్యక్రమాంలో ప్రాథిమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర-అవనిగడ్డ : పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారుల నుండి ఆదేశాలు అందినట్లు అవనిగడ్డ పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు అన్నారు. అవనిగడ్డ పంచాయితీ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి ప్రక్కన తాటి ఆకులతో పాక ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామ పంచాయితీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న తోట శ్రీనివాసరావు ఎడ్లంక పంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి బాటచారులకు త్రాగు నీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయితీ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని శ్రీనివాస్ చెప్పారు.

విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-అవనిగడ్డ : గ్రేడ్ 1 గ్రంథాలయంలో పలు పోటీ పరీక్షలకు సిద్ధపడి ఉద్యోగ అర్హత సాధించిన ఇరువురిని ఘనంగా సన్మానించారు. గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి జె ప్రభుదాసు ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయంలో విద్యార్థిని విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి ఇరువురు ఉద్యోగాలు సాధించారు. మండల పరిధిలోని మోదుమూడి గ్రామానికి చెందిన బి మణికంఠ రైల్వే ఉద్యోగం, తెలంగాణా రాష్ట్రం కరీంనగర్ ప్రాంతానికి చెందిన కె స్నేహ కేంద్రీయ విద్యాలయంలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగాలు సాధించారు. వీరి ఇరువురిని గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో దుసాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, రికార్డ్ అసిస్టెంట్ బి కృపారావు,వి శ్రీదేవి, లైబ్రేరియన్ (ఓఎస్) సి హెచ్ పద్మజ లు పాల్గొన్నారు.

నేటితో పోస్టల్ బ్యాలెట్ ముగింపు

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎన్నికల విధులకు హాజరయ్యే వారు పోస్టల్ బ్యాలెట్ కొరకు ఫారం -12 ఈనెల 26 తేదీలోగా వారు పని చేస్తున్న నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నందు అందజేయవలసి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వారికి వచ్చిన దరఖాస్తులను అనెగ్జర్ -4 నందు నిర్దేశించిన విధంగా జాబితాలతో కూడిన డేటా బేస్ సిద్ధం చేయవలసి ఉంటుందని తెలిపారు. అనివార్య కారణాలవల్ల ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారు కూడా వారి ఫామ్ -12 ను కూడా వారు పనిచేస్తున్న నియోజకవర్గం లో 26 తేదీలోగా అందించవలిసి ఉంటుంది. వారి వివరాలను జిల్లాల వారీగా రిటర్నింగ్ అధికారులు, ఈనెల 27 తేదీన జాబితాలు సిద్ధం చేసి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయమునకు పంపవలెనని, 28వ తేదీన వెలగపూడి సచివాలయం లో కేంద్రీయ మార్పిడి పద్ధతి లో జిల్లాల మధ్య ఫస్ట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఫామ్- 12 నిర్వహిస్తారన్నారు. ఈనెల 29వ తేదీన నామినేషన్ ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత సర్వీస్ ఓటర్లకు ఈ.టి.పి.బి.ఎస్. సాఫ్ట్ వేర్ ద్వారా బదిలీ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈనెల 29వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్లు ముద్రణ మరియు సంబంధిత నియోజకవర్గాలకు సరఫరా చేయవలసి ఉంటుందన్నారు. ఈనెల 30వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొరకు, అన్ని నియోజకవర్గాలలో రిటర్నింగ్ అధికారులు ఫెసిలిటేషన్ సెంటర్స్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. మే నెల 10వ తేదీన పోలైన పోస్టల్ బ్యాలెట్లుమరియుఉపయోగించని పోస్టల్ బ్యాలెట్ లపత్రాలను కేంద్రీయ మార్పిడి పద్ధతిలోజిల్లాల మధ్య థర్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ పోస్టల్ బ్యాలెట్‌లను వెలగపూడి సచివాలయమునందుమార్పు చేసుకుంటార న్నారు. మేనెల11వ తేదీనఓటర్లజాబితా మార్కుడు కాపీ నిర్ధారించి సిద్ధం చేసుకోవాలన్నారు.

కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకుండా ధైర్యంగా పోరాటం చేయాలని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. 4 వ వార్డులో బుధవారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులైన యాసం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను గురువారం రాయపూడి వేణుగోపాలరావు పరామర్శించి ధైర్యం చెప్పి ప్రమాదంకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, వెంకటేశ్వరరావు కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని రాయపూడి ధైర్యం చెప్పారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

మాటల్లేవ్.. అంతా మందు.. విందే..!

- కూటమి 'మాట-మంతి'లో మాటలు కరువు
- మందు.. విందుకే ప్రాధాన్యం
- మీటింగ్ సమయంలో 100 మంది.. విందుకు వెయ్యి మంది...?
- ఇదీ కూటమి 'మాట-మంతి' కార్యక్రమం తీరు!
- ఐక్యతను చాటుకునేందుకు బీజేపీ, టీడీపీ, జనసేన నానా తంటాలు..

కూటమి 'మాట-మంతి'లో జనంలేక ఖాళీగా ఉన్న ఖర్చీలు

సమావేశం బయట మద్యం తాగుతున్న కార్యకర్తలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవని.. అంతా కలిసే ఉన్నామని ఐక్యతను చాటుకునేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు నానా తంటాలు పడుతున్నారు. ఒకే కాంప్లెక్స్‌లో... ఒకేసారి సమయంలో... వేర్వేరుగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో కూటమిలో కుమ్ములాటలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. ఈ విషయం నియోజకవర్గంలోని మూడు పార్టీల క్యాడర్లతోపాటు ప్రజల్లోను తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో అందరం కలిసే ఉన్నామని చాటుకునేందుకు బుధవారం రాత్రి ఆఘమేఘాలపై పాలఫ్యాక్టరీ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో 'కూటమి మాట-మంతి' పేరుతో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాటలకంటే మందు, విందుకే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలుస్తోంది. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరితోపాటు జనసేన నాయకులు హాజరయ్యారు. అయితే, ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్దగా మాట్లాడుకున్నది ఏమీ లేదని.. మంచి చెడు గురించి కూడా చర్చలేదని సమాచారం. కేవలం ముఖ్యమైనా కార్యకర్తలను పిలిపించి ఐక్యంగా ఉన్నామని చాటుకునేందుకు పెద్ద ఎత్తున మందు, విందు ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమావేశం ప్రారంభమై.. నాయకులు మాట్లాడుతున్నంత సేపు కేవలం 100 నుంచి 150 మంది మాత్రమే కార్యకర్తలు ఉన్నారు. అదే విందు ప్రారంభమయ్యే సమయానికి వెయ్యి మందికి పైగా అక్కడ చేరారు. దీంతో ఈ సమావేశం కేవలం తాము ఐక్యంగా ఉన్నామని ప్రజలను నమ్మించేందుకే ఏర్పాటు చేశారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మూడు జెండాలు కనిపించేలా చూడండి బాబూ...

మరోవైపు గురువారం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల ప్రచారంలోనూ తరచూ కార్యకర్తలకు 'మూడు పార్టీల జెండాలు కనిపించేలా చూడండి బాబూ..' అని చెప్పడం కనిపించింది. ఎన్నికల ప్రచారంలోనూ తాము ఐక్యంగా ఉన్నామని చాటుకునేందుకు ఆయా పార్టీలు ప్రయత్నిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అంతర్గతంగా ఏదో జరుగుతోందని, అందువల్లే ఇలా మూడు జెండాలు కలిపించాలని ప్రతిసారి చెబుతున్నారని కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది.

విస్సన్నపేట మండలపరిషత్తుపై లోకాయుక్త విచారణ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలపరిషత్తులో నిధుల దుర్వినియోగం అంశంపై వచ్చిన ఫిర్యాదుపై లోకాయుక్త కేసు నమోదు చేసింది. ముఖ్యమంత్రి జగన్ తిరువూరులో నిర్వహించిన సభ నిర్వహణ నిమిత్తం విస్సన్నపేట మండలపరిషత్తు నిధుల నుంచి అధికారులు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. ఈ విషయాన్ని సమాచారహక్కు చట్టం ద్వారా ఒక సామాజిక కార్యకర్త బొట్ల శివసత్యనారాయణ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. పొరుగు మండలంలో ముఖ్యమంత్రి సభ నిర్వహిస్తే నిబంధనలకు విరుద్ధంగా మండలపరిషత్తు నిధులను ఉపయోగించారని పేర్కొంటూ శివ సత్యనారాయణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు లోకాయుక్త తెలిపింది.

ఇండియా కూటమిని గెలిపిస్తే
రాష్ట్రానికి ప్రత్యేక హోదా

-రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీ, వైసీపీలను ప్రశ్నించండి
- కంకి,కొడవలి గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించండి
- సీపీఐ పశ్చిమ అభ్యర్థి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: ఇండియా కూటమి గెలిస్తేనే మన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా వస్తుందని ఇండియా కూటమి బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీవ్ర ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి.. అని అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు పేరుతో ఏకంగా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బీజేపీ, వైసీపీ అభ్యర్థులు ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని, వారిని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు. ప్రత్యేక హెూదా, రాజధాని లేకుండా బీజేపీ, వైసీపీ చేసిన మోసం వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందువల్ల మళ్లీ మోసం చేసేందుకు ఓట్లు వేయాలని కోరుతూ ఇళ్ల ముందుకు వచ్చే బీజేపీ కూటమి, వైసీపీ అభ్యర్థులను ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో కూడి ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రత్యేక హెూదా ఫైలుపై తొలి సంతకం ప్రధాని చేస్తారని, విభజన హామీలు అమలు చేస్తామని, అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీ కూటమిని, వైసీపీని ఓడించాలని, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న, నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి అయిన తనను కంకి-కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని జి.కోటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కంచర్ల నాగేశ్వరరావు, స్థానిక నాయకులు కోట రాంబాబు, నడికుదిటి వెంకటేశ్వరరావు, గునుపూడి సింహాచలం, అండమాన్ నాగమణితో పాటు యువజన సమాఖ్య, మహిళా సమాఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ ఖాజా రాజీనామా

త్వరలో వైసీపీలోకి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): కాంగ్రెస్ పార్టీకి విజయవాడ సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా మొహిద్దీన్ రాజీనామా చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మెంబర్ పదవికి కూడా ఆయన రాజీనామా చేశారు. గురువారం పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి పేరిట రాజీనామా లేఖ రాసి కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్లో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ లంబాడి పేట వద్ద ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ 10 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో తాము కష్టపడి పనిచేస్తూ పార్టీని తమ భుజాలపై మోస్తూ వస్తున్నామన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తామని గతంలో కాంగ్రెస్ నాయకత్వం హామీ ఇచ్చిందని అన్నారు. అయితే పొత్తుల నెపంతో ఈ సీటు ను తనకు కాకుండా సీపీఐకి ఇచ్చి తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగనన్న ప్రజాసంక్షేమ విధానాలను, పరిపాలన దక్షతను గుర్తించి త్వరలోనే వైయస్సార్ పార్టీలో చేరనునట్లు ఆయన చెప్పారు. విజయవాడ ఎంపీగా కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యేగా ఆసిఫ్ ను గెలిపించుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు మొహిద్దీన్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రచార హోరు.. ఎర్రజెండా జోరు

- జి.కోటేశ్వరరావు గెలుపు కోసం మహిళా దళం ప్రచారం
- ఇంటింటికి వెళ్లి కంకి-కొడవలి గుర్తు పై ఓటు వేయాలని అభ్యర్థన

విశాలాంధ్ర -విజయవాడ (వన్‌టౌన్): సార్వత్రిక ఎన్నికలో సీపీఐ ప్రచారం హోరెత్తుతున్నది. ఎర్ర జెండా పార్టీకి తోడు మహిళా దళంతో పాటు సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారంలో నడుంబిగించారు. మరింత జోరు పెంచారు. గురువారం విజయవాడ పశ్చిమ సీపీఐ అభ్యర్థి జీ. కోటేశ్వరరావు గెలుపు కోసం మహిళా దళం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. విజయవాడ 39,35డివిజన్ లోని విద్యాధరపురం కామకోటి నగర్, పెజ్జోనిపేట ప్రాంతాల్లో ఈ ప్రచారం నిర్వహించారు. కంకి-కొడవలి గుర్తు పై ఓటు వేసి కోటేశ్వరరావును భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నగర మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పదేళ్లలో మహిళలు, చిన్నారుల పై దాడులు, అత్యాచారాలు బాగా పెరిగాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వంలో అరచకాలు, కక్ష సాధింపుల పాలన సాగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి మరిచిరన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా మతం పేరుతో మతోన్మాద చర్యలు చేపడుతోందని ఆరోపించారు. నిత్యం ప్రజల్లో ఉండే సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకులు పి.రాణి, తమ్మిన దుర్గ, డీ.సీతారామమ్మ, మూలి ఇందిరా, భాగ్యలక్ష్మీ, చింతడా పార్వతీ, అండిమాని నాగమణి, కొట్టు విజయ లక్ష్మీ, వెలంగాని రాణి, అనసూయ, రాజ్యలక్ష్మీ సావిత్రి, భవన సుందరి, డీ.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నష్టం కోట్లలోనే..? : బాధిత రైతులు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల పరిధిలో గోకరాజుపల్లి, వెల్లంకి గ్రామాల శివారులో బుధవారం సంభవించిన అగ్నిప్రమాదంలో రైతులకు భారీగా నష్టం వాటిల్లినది. బుధవారం మధ్యాహ్నం ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక శకటం రాత్రి 8 గంటలవరకు అందుబాటులోకి రాకపోవటంతో వందల ఎకరాల్లో సుబాబులు తోట దగ్ధమయినట్లు రైతులు తెలిపారు. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం గోకరాజుపల్లి గ్రామ పరిధిలో 81 ఎకరం, వెల్లంకి గ్రామ పరిధిలో 92 ఎకరాలలో ప్రమాద తాకిడి ఉన్నట్లు అంచనా. ప్రమాద నష్టం కోట్లలో ఉండొచ్చని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని, నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరారు.

జిల్లాలో 116 మంది అభ్యర్థుల నామినేషన్లు

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాలో నామినేషన్ల స్వీకరణలో ఏడో రోజైన 25వ తేదీ గురువారం 116 మంది అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం జరిగిందని.. ఇందులో విజయవాడ పార్లమెంటుకు 22 మంది అభ్యర్థులు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 94 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.డిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. మే 13 న నిర్వహించనున్న పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో భాగంగా ఏడో రోజైన 25వ తేదీ గురువారం వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 116 మంది అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించిన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు.

కోర్టుల వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో న్యాయ స్థానాల ప్రాంగణంలో గురువారం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి ఏ.సత్యానంద్ ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బార్ కౌన్సిల్ మెంబరు చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా న్యాయస్థానాల ప్రాంగణంలో న్యాయవాదులకు, కక్షిదారులకు దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో ఈ ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు హిమ బిందు, డి.లక్ష్మి, రమణారెడ్డి, బీబీఏ అధ్యక్షులు కె.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శివరాంప్రసాద్(రాజా) తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో దోమల పెరుగుదల లేకుండా చూడాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మలేరియా వ్యాధి ప్రబలకుండా దోమల పెరుగుదల లేకుండా ఇంటి పరిసరాల్లోని మురికి కాలువలో చెత్తాచెదారం నిల్వ ఉడా పరిశుభ్రంగా ఉంచాలని క్యాపిటల్ హాస్పటల్ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషి(యన్ ఎమ్,పిజిడిఐడి) డాక్టర్ జె.పూర్ణచంద్రరావు సూచించారు.గురువారం విజయవాడ డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా అనేది ప్రత్యక్షంగా గాని పరోక్షంగా మనందరిని ప్రావితం చేసే వ్యాధి అన్నారు. మురికి నీరు ఎప్పుడూ పారేటట్లు చూడాలని, ఇంటి పరిసరాలలో ఖాళీ టైర్లు, సీసాలు, కొబ్బరి బొండాలు తదితర పరికరాల్లో నీటి నిల్వ ఉండి దోమలు పెరుగుదలకు దోహదం చేస్తాయని పనికిరాని వస్తువులను తొలగించి నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటే దోమల పెరుగుదలను అరికట్టవచ్చునన్నారు. మురికినీటి నిల్వలో వారానికి ఒకసారి కిరోసిన్ ఆయిల్ లేదా వాడిన ఇంజన్ ఆయిల్ ను చల్లి దోమలు పుట్టుకను నివారించాలన్నారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లలో దోమల రిపెల్లెంట్స్, దోమ తెరలు వాడడం, ఇంటి కిటికీలకు మెష్ ఏర్పాటు లాంటి చర్యల ద్వారా దోమ కాటు నుండి రక్షించుకోవచ్చని అన్నారు. మరుగు దొడ్ల బావికి ఏర్పాటు పైపుకు దోమల మాట్ ను ఏర్పాటు చేసుకొవాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జైదీప్,కాలనీ ఛీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ వి.వాసుదేవరావు,తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ విక్రయాన్ని హైకోర్టు అడ్డుకుంది : కేఏపాల్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు ఇది దేశానికే గర్వకారణం అటువంటి దానిని దురుద్దేశ్యంతో, నష్టాల బూచీచూపి, తన అధికార దాహంతో మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయటానికి కుట్రలు చేస్తూంటే వాటిని అడ్డుకోవటానికి తాను రాష్ట్ర హైకోర్టులో ఫిటిషన్ వేసి దాదాపు 39 నెలలుగా పోరాటం చేయగా ప్రస్తుతానికి స్టీల్ ప్లాంట్ అమ్మటానికి వీలు లేదు అని స్టేటస్-కో స్టే హైకోర్టు ఇచ్చింది అని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కే.ఏ.పాల్ స్పష్టం చేశారు. గురువారం గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి గురికాకుండా ఫిల్ వేసాను స్టీల్ ప్లాంట్ అమ్మకూడదు అని చెప్పాను, అన్ని పార్టీలు కోట్లు కర్చుపెడుతున్నారు తాను మాత్రం ఒక్క రూపాయి కూడా కర్చుపెట్టను అయినా విశాఖలో తాను గెలుస్తాను,విశాఖ ప్రజలు తనను కోరుకుంటున్నారు అన్నారు.తాను ఎంపిగా గెలిపిస్తే విశాఖను అమ్మనివ్వను అక్కడ అనేక కంపెనీలు తీసుకువచ్చి 10లక్షల ఉద్యోగాలు ఇస్తాను అన్నారు. 16 వేల కుటుంబాలు ఈ స్టీల్ ప్లాంట్ కోసం భూములు ఇచ్చారు ఆ నిర్వాసితులు తనను విశాఖ ఎంపిగా నామినేషన్ వెయ్యమని కోరారు అన్నారు.తాను గాజువాక ఎంఎల్ఏ, విశాఖపట్నం ఎంపిగా నామినేషన్ వేసాను అని తెలిపారు.

సంజీవయ్య కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వలేని దద్దమ్మ ప్రజాప్రతినిధులు

-ధరలపై, ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను గెలిపించండి
-సెంట్రల్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి సీహెచ్.బాబూరావు

విశాలాంధ్ర-విజయవాడ: ఆరు దశాబ్దాలు గడిచినా సంజీవయ్య కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వలేని దద్దమ్మ ప్రజాప్రతినిధులుగా ఉన్నారని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి సిహెచ్ బాబురావు అన్నారు. 25వ డివిజన్ అరండల్ పేట, కుర్మయ్య వంతెన సెంటర్ ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ...ఇన్నాళ్లు పాలించిన పాలక పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు వారి సొంత ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. పేదలకు పట్టాలి ఇవ్వటానికి అభ్యంతరం చెబుతున్నారని, కాలువ కట్టలపై స్టార్ హెూటల్స్, బార్లు, పెద్ద పెద్ద బిల్డింగులు కట్టుకుంటున్నారని చెప్పారు. పేదలకు మాత్రం అనేక వంకలు చెప్పి పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేయటం దుర్మార్గం అన్నారు. కేంద్రంలో బీజేపీ ధరలు పెంచితే, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పన్నుల భారాలు వేసి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. పెట్రోల్ ధరలు కేంద్రం పెంచితే, దానిమీద వివిధ రకాల టాక్సు వేసి ప్రజలపై భారాలు మోపిందన్నారు. వంటగ్యాస్ 400 నుండి 1200 వరకు పెంచిన బీజేపీతో జతకట్టి, ధరలను తగ్గిస్తామని తెలుగుదేశం, జనసేన చెప్పటం ప్రజలను మరో మోసం. దీనికి వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్టీలు పోరాడుతున్నాయి. విజయవాడ నగరంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఇతర ఇండియా వేదికలోని పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విజయవాడ సెంట్రల్ సిటీలో సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించి, అసెంబ్లీకి పంపిస్తే పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పేదల ఇళ్ల కోసం పోరాడిన చరిత్ర ఉన్న కమ్యూనిస్టులు, గతంలో కార్పొరేటర్ గా స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా ఉన్నప్పుడు 40 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందన్నారు. ఈ పదేళ్ల నగరాన్ని పాలించిన ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు వారి సొంత ఆస్తులు పెంచుకుని, ప్రజలను కొల్లగొట్టారని విమర్శించారు. కమ్యూనిస్టులకు అవకాశం ఇస్తే ప్రజారంజక పాలనతో నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు కేవీ.భాస్కర్ రావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు వి గురునాథం, శ్రీ శ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, మెడికల్ రిప్స్ మాజీ నాయకులు రెడ్డి, పీవీ ఆంజనేయులు, నగర కార్యదర్శి బి.రమణ , మాజీ కార్పొరేటర్ కాజా సరోజా, వై సుబ్బారావు, లక్ష్మణ , మహేష్, వెలగా శీను తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి గయాసుద్దీన్ (ఐజా)నామినేషన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంగరంగ వైభవంగా పండుగ వాతావరణం లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థిగా జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) గురువారం తన నామినేషన్ వేశారు. పాల ఫ్యాక్టరీ సమీపంలోని సాయిరాం థియేటర్ వద్ద నుంచి ప్రారంభమైన గయాసుద్దీన్ ర్యాలీ చిట్టినగర్ సెంటర్ ,కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా రథం సెంటర్ వరకు జరిగింది. ఆద్యంతం ఎంతో హుషారుగా జరిగిన ర్యాలీలో మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గయాసుద్దీన్ ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని ,వాటినీ పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలని లక్ష్యంతో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఆయన చెప్పారు. పశ్చిమ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా తన వద్ద కొన్ని ప్రణాళికలు ఉన్నాయని, వాటిని అమలు చేస్తే పశ్చిమ నియోజకవర్గం నెంబర్ వన్ గా అభివృద్ధి చెందుతుందని ఐజా వివరించారు. కాగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన గయాసుద్దీన్‌ను అభినందించారు.

తాతయ్య నామినేషన్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గం టిడిపి బిజెపి జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నామినేషన్ సందర్భంగా పట్టణంలో తెలుగుదేశం,బిజెపి,జనసేన పార్టీల నాయకులు,కార్యకర్తలతో పట్టణం జన సంద్రం గా మారింది. పట్టణంలోని వినాయకుని గుడి వద్ద ఉన్న తాతయ్య స్వగృహం నుండి ముత్యాలమ్మ గుడి, పాతపేట గడ్డ మీదుగా భారీ జన సమూహంతో ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు భారీ ర్యాలీగా చేరుకుని బహిరంగ సభ నిర్వహించిన అనంతరం జగ్గయ్యపేట ఎమ్మార్వో ఆఫీసుకి ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్,విజయవాడ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కేశినేని శివనాద్ (చిన్ని), జగ్గయ్యపేట మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావుతో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేసారు. అనంతరం ఎన్ టీ ఆ ర్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పలువురు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం మరియు ప్రస్తుత వైఎస్ఆర్ ప్రభుత్వం విస్మరించిన అభివృద్ధిని టీడీపీ ప్రభుత్వం రాగానే సంక్షేమాన్ని, అభివృద్ధిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాతయ్య నామినేషన్‌కు వెళ్లిన కూటమి కార్యకర్తలు.

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తెలుగుదేశం పార్టీ జగ్గయ్యపేట నియోజక అభ్యర్థి శ్రీరామ్. రాజగోపాల్ తాతయ్య నామినేషన్‌కు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతల. సీతారామయ్య ఆధ్వర్యంలో కూటమి కార్యకర్తలు గురువారం జగ్గయ్యపేట తరలివెళ్లారు. శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద నుండి జగ్గయ్యపేట వరకు బైకు ల పై నినాదాలు చేస్తూ ఉత్సాహం తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎంపిపి వేగినేటి. కృష్ణ మూర్తి.తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్లు కర్ల. వెంకట నారాయణ. లగడపాటి. వెంకటేశ్వర రావు. కాకాని. శ్రీనివాసరరావు. అత్తు లూరి. అచ్యుత్ రావు. నూతల పాటి. చెన్న కేశవరావు. లగడపాటి. శంకర్. మాజీ. జెడ్ పిటిసి. గజ్జి. కృష్ణ మూర్తి.మాజీ సర్పంచ్.జిల్లేపల్లి. సుదీర్ బాబు. నల్లపునేని కొండ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNION CIVIL JUDGE AT VIJAYAWADA

E.P.No.25/2022 In A.C.P.No.20/19

BETWEEN:
Shriram Chits (P) Ltd
Jaggayyapeta Branch - D.H.R.
Vs.
M. Vijaya Babu & Others - J.D.Rs
To,
JDR No.1
M. Vijaya Babu, S/o. Durga Rao, Hindu aged about 33 years, Medical Officer, D.No : 10-71, Reddy Bazar, Chandarla padu Post & Mandal, Krishna Dist.

పై నెంబరు ఇ.పి.లో DHR Company వారు JDR1 పై Decree బాకీని ఖర్చులతో రాబట్టుకొనుటకు U/or R21 R48 CPC ప్రకారం దాఖలు చేయగా అందుపై ఇ.పి.లో 1వ JDRకు U/or R21 R48 CPC ప్రకారం నోటీసులు నిమిత్తం ది. 14-05-2024 శ్రీ కోర్టువారు వాయిదాగా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం. 10.30ని॥లకు 1వ JDRపై కోర్టువారి ఎదుట స్వయంగాగాని, న్యాయవాది ద్వారాగాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది : 14-5-2024

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

పసుపులేటి సత్య శ్రీనివాసరావు, అడ్వకేట్, జగ్గయ్యపేట.

BEFORE THE HON'BLE IV SPECIAL MAGISTRATE AT VIJAYAWADA

C.C.No.101/ 2020

Between:
Vemula Venkata Ramana
S/o. Jalachandrarao
SeetaRamapuram, Vijayawada
..... Complainant

AND

B.Srinivasa Rao, S/o.Late.Pullaiah, D.No. 21-10/1-115A, Teacher's Colony, Mutyalampadu, Vijayawada
..... Accused

పై కేసు నందు Accused అయిన B.Srinivasa Rao, S/o.Late.Pullaiah, కోర్టువారు NBW ఇచ్చిన కోర్టుకి హాజరు కాకపోవడం వలన warrantexecution Advocate Commissioner ని అపాయింట్ చేసిన సదరు accused అయిన B.Srinivasa Rao, S/o.Late.Pullaiah, abscond ఉండటం వలన కోర్టు వారు అతని పై section 82 crpc క్రింద warrant అమలు కావటంలేదు అని accused పరారీలో ఉన్న వ్యక్తిగా భావిస్తూ యీ ప్రకటన చేయడం జరిగినది. (proclamation) ఈ ప్రకటన జారీ అయిన 30 రోజుల లోపున కోర్టు యందు హాజరు కావాలసినదిగా లేనిచో abscond క్రింద ప్రకటించడం జరుగును.

Mathi Syam, Advocate,
D.No. 30-9-7, FF2, AB Homes,
NamburiVari Street, Durga Agraharam,
VIJAYAWADA-2. Cell: 9297051666.
Vijayawada Dt: 24-04-2024

కృష్ణమ్మ చిత్ర బృందం సందడి

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట: విజయవాడ నగరంలో కృష్ణమ్మ చిత్ర బృందం సందడి చేసింది. బెజవాడ నగరం ఇతివృత్తంగా నగరంలో 60 రోజులపాటు కృష్ణమ్మ చిత్రాన్ని నిర్మించామని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పక విజయవంతం చేయాలని హీరో సత్యదేవ్ కోరారు. స్టెల్లా కాలేజ్ సమీపంలోని హివాగా స్కూల్ ఆఫ్ బ్యూటీ సెంటర్లో కృష్ణమ్మ చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో హీరో సత్యదేవ్ మాట్లాడుతూ కృష్ణమ్మ చిత్రాన్ని విజయవాడ పరిసర ప్రాంతాల్లో నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వన్ టౌన్ వించిపేట కొండ ప్రాంతంలో, మూలపాడు అటవీ ప్రాంతంలో సినిమా చిత్రీకరణ జరిగిందన్నారు. ఈ చిత్రంలో తాను వించిపేట భద్ర క్యారెక్టర్ లో ప్రేక్షకులకు కనబడతానని చెప్పారు. ముగ్గురు స్నేహితుల మధ్య జరిగే కథే ఈ చిత్రమని తెలిపారు. మే మూడో తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారని చిత్రంలో ఉన్న కంటెంట్ నచ్చి ఆయన ప్రజెంట్ చేయడానికి ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం దర్శకుడు వివి గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను విజయవాడ నగరంలోనే పుట్టి పెరిగానని విజయవాడ ఇతివృత్తంగా విజయవాడ అందాలను ప్రపంచానికి తెలియజేసే ఉద్దేశంతో కృష్ణమ్మ చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ చిత్రంలో సత్యదేవ్ పాత్ర పవర్ఫుల్ గా ఉంటుందని ఆయన నటన సహజంగా ప్రేక్షకులకు కచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుందని చెప్పారు. స్నేహానికి ఉన్న విలువను కృష్ణమ్మ చిత్రంలో చూపించినట్లు ఆయన వివరించారు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉన్నారని కథ పరంగా వారి పాత్ర కూడా ఎంతో అద్భుతంగా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. రఘు కుంచే,అర్చన,నందగోపాల్,లక్ష్మణ్, కృష్ణ తదితరులు చిత్రంలో వారి పాత్రలకు న్యాయం చేశారని చెప్పారు. అనంతరం హీరోయిన్ అర్చన అయ్యర్ మాట్లాడుతూ కృష్ణమ్మ చిత్రంలో తాను పద్మ అనే క్యారెక్టర్ లో కనబడతానని క్యారెక్టర్ ప్రేక్షకులకు హత్తుకునే విధంగా ఉంటుందని చెప్పారు.

ప్రజలకు దాహార్తిని తీర్చటం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చటానికి తమవంతూ సహాయంగా పలు ప్రాంతాల్లో చల్లని మజ్జిగ అందజేస్తున్నామని హరివిల్లు ఫౌండేషన్ సీనియర్ సభ్యులు కూనపరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వివిధ సేవాకార్యక్రమాలు చేస్తున్న హరివిల్లు ఫౌండేషన్ ఈ వేసవి కాలంలో ప్రజలకు తమవంతుగా సేవచేయాలనే ఉద్దేశంతో ఏప్రిల్ నెల నుండి జులై నెల వరకు నగరంలోని వివిధ ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ సేవాకార్యక్రమం చేపట్టారు. గురువారం జె.ఆర్.డి.టాటా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని రామా బాడీ బిల్డర్స్ సహకారంతో పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం12 నుంచి 3గంటలవరకూ వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న పాదచారులకు, వాహనచోదకులకు చల్లటి మజ్జిగను అందజేశారు. ఇప్పటివరకూ తమ ఫౌండేషన్ వైద్య రంగంలో, విద్యారంగంలో,అనాధాశ్రమాలలో,వృద్ధాశ్రమాలలో ఇంకా అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం కూనపరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమకు జీవనోపాధి కల్పిస్తున్న ప్రాంతంలో ఒక మంచి కార్యాక్రమం చేట్టామన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి తమ ఫౌండేషన్ సభ్యులేకాక ఈ సేవాకార్యక్రమం గురించి తెలుసుకుని స్వచ్ఛందంగా సహకరించడానికి దాతలు కూడా ముందుకురావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు,ప్రధాన కార్యదర్శి అయిన డా.శరత్ కుమార్, కూనరెడ్డి రాము, కె.మణికంఠ,పల్లా మహేష్,సభ్యులు ఎమ్.బాలసూర్యనారాయణ,శ్రీదేవి, కిరణ్మయి,దాసరి వెంకటేష్, ఎమ్. వి. ఎస్.ఎన్.ప్రసాద్,అప్పలరాజు, కిరణ్మయి,తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ఫలితాలు

జెఇఇ-మెయిన్ ర్యాంకులు

బి.తన్విక	ఎ.సంపత్	పి.అస్మిత	బి. నిత్యశ్రీ	కె.యన్.జి.ధృవ	కె.యు.బాలకుమా
1140	1441	3690	4630	5150	6598

విశాలాంధ్ర- విజయవాడ ఎడ్యుకేషన్: గురువారం ప్రకటించిన జెఇఇ-మెయిన్-2024 ప్రవేశ పరీక్ష ఫలితాలలో మొఘల్రాజపురంలోని శారద విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరీలలో మంచి ర్యాంకులను సాధించారు. జాతీయస్థాయిలో బి. తన్విక (1140), ఎ.సంపత్ (1441), పి.అస్మిత (3690), బి. నిత్యశ్రీ(4630), కె. నాగరాహుల్ ధృవ (5150), కె. ఉదయ బాలకుమార్ (6598) ర్యాంకులను సాధించారు. తమ విద్యార్థులు జెఇఇ-మెయిన్ -2024 ప్రవేశ పరీక్షలో చక్కటి ప్రతిభ కనబరిచారని, తమ కళాశాల కేవలం డెస్కాలర్స్ విద్యార్థులతోనే ఉత్తమ ఫలితాలను సాధించగల్గిందని విద్యా సంస్థల ఛైర్మన్ డా? వై రమేష్ బాబు తెలిపారు. తమ విద్యాసంస్థలకు చెందిన 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా సుమారు 350 మందికి పైగా విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించారని, ఇంత తక్కువ మంది విద్యార్థులతో ఇంత మంచి ఫలితాలు సాధించడం చాలా ఆనందముగా ఉందని, అధ్యాపకులను, విద్యార్థులను విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదాదేవి అభినందించారు. ఒత్తిడి లేని, విలువలతో కూడిన విద్య, విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకుల సలహాలు, సూచనలు, ప్రశాంత వాతావరణం, ఆన్లైన్ పరీక్షా ప్రణాళిక విద్యార్థులకు ఎంతో అనుకూలించిదని కళాశాలల అడ్వైజర్ ఇ.యస్.ఆర్.కె ప్రసాద్ తెలియజేశారు. ఈ విధంగా ఫలితాలను సాధించడానికి విద్యార్థుల పట్ల మేనేజ్మెంట్ చూపిన వ్యక్తిగత శ్రద్ధ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని కళాశాలల జి.యమ్. జి.వి. రావు తెలియజేశారు.

జనసంద్రమైన పామర్రు

విశాలాంధ్ర-పెదపారుపూడి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పామర్రు నియోజకవర్గ అభ్యర్థి కైలే అనిల్ కుమార్ జన సంద్రం మధ్యలో భారీ ఊరేగింపుతో పామర్రు ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవికి నామినేషన్ పత్రం గురువారం దాఖలు చేశారు. అనంతరం స్థానిక సెంటర్ బహిరంగ సభ లో పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్ కుమార్, పార్లమెంట్ మచిలీపట్నం అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి చేసిన విధానమును నియోజకవర్గ ప్రజలు అవగాహన చేసుకుని మరొకసారి ఆదరించాలని ఆయన సభాముఖంగా ఓటర్లను వేడుకున్నారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి అఖండ విజయం చేకూర్చాలని అన్నారు. పామర్రు సెంటర్లో ఇటీవల జరిగిన సభలలో టిడిపి అధినేత చంద్రబాబు తనను విమర్శించిన, పిసిసి అధ్యక్షురాలు అసత్యాలు మాట్లాడిన పట్టించుకోవాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి దీవెనలు, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు తనపై ఉన్నంతకాలం ప్రజల గుండెల్లో నేను, నా గుండెల్లో ప్రజలు ఉంటారని కైలే వివరించారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం : కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- రాష్ట్ర ప్రజల సంక్షేమం ఒక్క చంద్రబాబునాయుడికే సాధ్యమని పెడన నియోజకవర్గ టిడిపి ఎం ఎల్ ఏ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు . పెడన నియోజక వర్గ జనసేన బిజెపి బలపరచిన టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ బ%శీ%టుమిల్లి మండలం నాగేశ్వరావుపేట పంచాయితీ జానకిరామపురం గ్రామంలో గురువారం ఇంటింటికి వెల్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు . రేపు రానున్న రోజుల్లో తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ని గెలిపించాలని సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని,అలాగే బందరు పార్లమెంటు జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న వల్లభనేనీ బాలశౌరి గ్లాస్ గుర్తుకి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కాగిత కొరారు. గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పట్టి పూలమాలలతో విశేష ఆదరణ చూపించిరు.వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు .ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ ఈ జగన్ మోహన్ రెడ్డి అధికారం లోకి రాగానే మద్యనిషేధం చేస్తానని అక్క చెల్లమ్మ లకు ,మహిళలకు చెప్పి అధికారం లోకి వచ్చిన తరువాత వీధి వీధి న మద్యం అమ్మకాలు జోరుగా పెంచి మహిళ ల యొక్క జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ - జనసేన - బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొని బ్రహ్మరథం పట్టారు...

కేశినేని నాని ప్రచారానికి ఆదరణ కరువు : సౌమ్య

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ పట్టణంలోని మొక్కపాటి నగర్ లో ఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాద్ కార్యకర్తలతో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్టలు తెంచుకున్న ఆనందంతో వైసీపీ నేతలు తెలుగుదేశం లోకి చేరుతున్నారు గతంలో ఎన్నడూ చూడని భారీ మెజారిటీతో తంగిరాల సౌమ్య నందిగామ లో గెలవబోతున్నారు విజయవాడ పార్లమెంట్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమని టీడీపీ విజయవాడ పార్లమెంటు కూటమి ఉమ్మడి అభ్యర్థి కేశినేని శివనాథ్ (నాని) పేర్కొన్నారు. గురువారం నందిగామ పట్టణం ముక్కపాటి నగర్ లో కూటమి ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య, ఎంపీ అభ్యర్థి శివనాథ్ (చిన్ని) ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి తిరిగి కరప త్రాలను పంచుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. చిన్ని మాట్లాడుతూ 9వ వార్డులో ప్రజలుచూపించే ఆదరణ చూస్తుంటే భారీ మెజారిటీ ఈ వార్డు నుంచి రాబోతుందని, గత పది రోజుల నుంచి చూస్తుంటే ఎప్పుడెప్పుడు తెలుగు దేశంలో చేరుదామని వైసిపి నాయకులు ఎదురు చూస్తున్నారన్నారు. నందిగామ నియోజకవర్గం లో కూడా అధికార పార్టీతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు వైఖరి మార్చుకోకపోతే ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. మంచి అధికారుల ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. వైకాపా ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి అసలు ఎన్నికల ప్రచారం చేసుకోవటమే రాదని, ఏసీ గదుల్లో కూర్చుంటారు, నానికి ప్రజల స్పందన తెలియదు. మొదట్లో తెలుగుదేశం 60 శాతం ఖాళీ అయిద్ది అన్నారు. తర్వాత 20 శాతం అన్నారు. ఆ తర్వాత బ్యాలెట్ పత్రాలు చూస్తే తెలుస్తుంది అన్నారు. ఇప్పుడు ఓటమి భయంతో మాట్లాడుతున్నారు. చివరికి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. చివరికి సొంత చెల్లెలు పైన ఎన్నికలకమిషన్ కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఆడవారి మీద తప్పుడు కేసులు పెడుతున్నారంటే ఏ దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నాడో తెలుసుకోవాలి. కుటుంబ సభ్యుల పైన తప్పుడు ఫిర్యాదులు చేస్తూ కేసులు పెట్టిస్తున్నారు. ఇప్పటివరకు వైకాపా నాయకుల దౌర్జన్యాలకు భయపడి మౌనంగా ఉన్నారని, ఇప్పుడు అంతా బయటకు వస్తున్నారన్నారు. నందిగామలో తంగిరాల సౌమ్య భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు.

డిసెంబర్‌లో కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలు

నాట్య క్షేత్రంలో అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం

50 అడుగుల ఎత్తులో పతాక స్తూపం ఏర్పాటు

విశాలాంధ్ర-కూచిపూడి: కూచిపూడి వారసత్వ కళా సంస్థ(హెరిటేజ్ ఆర్ట్ సొసైటీ) ఆధ్వర్యంలో ఈఏడాది డిసెంబర్ 27, 28, 29 తారీకులలో కూచిపూడి అగ్రహారంలో తొలిసారిగా "అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం" నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు, నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతి (వెంకు) పేర్కొన్నారు. కూచిపూడి నాట్య క్షేత్ర మైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధయేంద్రయోగి నాట్య కళాపీఠంలోనాట్య పతాక స్వర్ణోత్సవాలునిర్వహిస్తున్నట్టు గురువారం విలేకరులతో పేర్కొన్నారు. ఈ సమ్మేళనం కూచిపూడి గ్రామంలోనిర్వహిస్తున్నామని,ఈ సందర్భంగా ప్రేక్షకులను మైమరిపించే నాట్య ప్రదర్శనలు ,కూచిపూడి నాట్యకళపై అవగాహన పెంచే సోదాహరణప్రసంగాలు, విజ్ఞులతోఅర్థవంతమైన చర్చలు తోపాటుపదివేల మంది కళాకారులతో కూచిపూడి పతాక గీతంతో కూడిన మహాబృందనాట్యం రసజ్ఞులైన ప్రేక్షకులకు కనువిందు చేసే మరొక అద్భుతమైన సన్నివేశమని పేర్కొన్నారు ఈ విశిష్ట వైభవ సమ్మేళనం రసజ్ఞులకు మరపురాని అనుభవంగా మిగులుతుందని ప్రకటించారు.అలాగే సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో 50 అడుగుల ఎత్తులో కూచిపూడి పతాక స్తూపాన్ని కళాపీఠం ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు.ఏభైసంవత్సరాలక్రితం ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం పార్వతీశం ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు భాగవతుల రామకృష్ణ శర్మ ఈ పతాకం రూపొందించినట్లు వివరించారు.అప్పట్లోయక్షగానచక్రవర్తిమహంకాళిసత్యనారాయణ, సంస్కృతాంధ్ర పండితులు మహా కాళి నరసింహం మాస్టర్,ఏ.ఐ.ఆర్.నటుడు బందా కనకలింగేశ్వరరావు ల సూచనలతో తుదిమెరుగులు దిద్దుకుందని వివరించారు. అంతటి మహోన్నత చరిత్ర కలిగిన ఈ పతాక స్వర్ణోత్సవ వేడుకలను ప్రముఖ నాట్యాచార్యులు కళా రత్న డాక్టర్ వేదాంతం రాదే శ్యాం, కళా పీఠం ప్రధానాచార్యులు కళా రత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ఆశీస్సులతో ఈ కార్యక్రమం కొనసాగిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు,వెంపటిసత్యప్రసాద్.గ్రంధాలయపాలకులువై.వి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీడు భూములను సాగు భూములుగా మారుస్తాం : మండలి

విశాలాంధ్ర-కోడూరు : మండల పరిధిలోని చివరి నీరు అందని బీడు భూములను సాగు భూములగా మార్చటమే నా లక్ష్యం అవనిగడ్డ నియోజక వర్గ శాసనసభ జనసేన పార్టీ ,తెలుగుదేశం పార్టీ ,భారతీయ జనతా పార్టీల కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తెలియచేసారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా కోడూరు శివారు గ్రామం అయిన దింటిమెరక గ్రామంలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు మండలంలోని చివరి భూమి వరకు సాగు నీరు అందించటమే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తాను అని గత నాలుగు సంవత్సరాలుగా నీరు లేక భూములు బీడు పొద్దాయిఅని దానికి పాలకుల లోపం అన్నారు.ఆ పరిస్థితి మండల ప్రజలకు రాకుండా ఉండాలి అంటే తనను గెలిపించాలి ఆని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బండే శ్రీనివాసరావు, కడవకొల్లు నాంచారయ్య, వేములపల్లి శ్రీకృష్ణ, వేములపల్లి రాజేష్,పిల్లి మల్లిఖార్జునరావు, మేకా నాగ భూషణం, జనసేన పార్టీ నాయకులు మర్రే గంగయ్య, ఉల్లి శేషగిరిరావు,కొండవీటి సునీత,కోట వెంకట రాంబాబు, పూతబోయిన కరుణకుమార్,పోతుల నాగరాజు,తుంగల రాజేష్,కడవకొల్లు మల్లి, భారతీయ జనతా పార్టీ తరుపున వడుగు నాగబాబు, దేవరకొండ సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-అవనిగడ్డ : కూటమి అభ్యర్దులను గెలిపించండి అంటూ ప్రచారం నిర్వహించారు. గురువారం అవనిగడ్డ 5 వ వార్డులో పట్టణ జనసేన, తెలుగుదేశం పార్టీల అధ్యక్షులు రాజనాల వీరబాబు, అన్నపరెడ్డి లక్ష్మీనారయణ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించి మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి కూటమి జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అసెంబ్లీ అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌లకు గాజు గ్లాసు గుర్తుపై రెండు ఓట్లను వేసి అఖండ మేజారిటీ చేకూర్చాలని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే అందించే సూపర్ సిక్స్ పథకాలను సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే నిరుద్యోగ యువతి యువకులకు మోగా డిఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తారని, సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంవత్సరానికి 3 గ్యాస్ సిలెండర్లు ఉచితం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, 45 సంవత్సరాలు వచ్చే వరకు మహిళలకు నెల 1500 రూపాయలు, తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి ఒకొక్కరికి 15 వేల రూపాయల చొప్పున ప్రోత్సాహం అందించడం జరుగుతుందని, డ్వాక్రా మహిళలకు కోటి రూపాయల వరకు ఋణాలు అందించడం జరుగుతుందన్నారు. 5 ఏళ్ళ పాలనలో నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటాయని, వాటిని నియంత్రించడంలో ప్రస్తుత ప్రభుత్వం వైఫల్యం చెందిందని, సామాన్యుల నడ్డీ విరిచిన ప్రభుత్వం జగన్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, జనసైనికులు, వీరమహిళలు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మాజీ ఉపసర్పంచ్‌లు ఘంటశాల రాజమోహన్‌రావు, అడపా శ్రీను, జనసైనికులు గుడివాక శివరామ్‌లతో పాటు పెద్ద ఎత్తున జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కరపత్రాలు పంపిణీ చేసి ఇంటింట ప్రచారం నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : మండల కేంద్రం అయిన పెనుగంచిప్రోలు గ్రామం తూర్పు బజారు దళిత వాడకు చెందిన వైయస్సార్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు జిల్లేపల్లి ప్రభాకర్, ముండ్లపాటి దానమ్మ, ముండ్లపాటి నాగార్జున, వనుకూరి శ్రీను, వనుకూరి ఏసుబాబు, వనుకూరి నాగరాజు, కత్తుల కోటేశ్వరరావు, కత్తుల మేరీ, కనకపుడి మహేష్ గార్లు అధికార వైఎస్ఆర్ పార్టీని వీడి పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య. ఆధ్వర్యంలో టిడిపి జాతీయ కోశాధికారి మరియు జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి,బిజెపి,జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి తాతయ్య సీతారామయ్య. పార్టీ కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ రెండవ సీజన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ టెక్ డొమైన్‌లలో యువతకు నైపుణ్యాన్ని పెంపొందించడానికి రూపొందించబడిన జాతీయ నైపుణ్య కార్యక్రమం శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ రెండవ సీజన్‌ను ప్రారంభించింది. శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ 18-25 సంవత్సరాల వయస్సు గల యువతకు భవిష్యత్ సాంకేతికతలలో నైపుణ్యాన్ని పెంపొందించడం, వారి ఉపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం భారతదేశ వృద్ధి కథనానికి బలమైన భాగస్వామిగా, సహకారిగా ఉండాలనే శామ్‌సంగ్ నిబద్ధతను బలపరుస్తుంది. యువతకు సరైన అవకాశాలను కల్పించేందుకు స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి భారత ప్రభుత్వ కార్యక్రమాలకు మద్దతుగా కూడా ఇది రూపొందించబడింది.

రిలయన్స్ జ్యువెల్స్ వింధ్య కలెక్షన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశపు ప్రముఖ ఆభరణాల బ్రాండ్ రిలయన్స్ జ్యువెల్స్ ఈ సంవత్సరం అక్షయ తృతీయ రోజున వింధ్య కలెక్షన్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రత్యేకమైన, అద్భుతమైన కలెక్షన్లతో పండుగలను జరుపుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. 'జ్యువెల్స్ ఆఫ్ ఇండియా' కలెక్షన్ సిరీస్‌లో తొమ్మిదోదైన వింధ్య మధ్యప్రదేశ్లోని గొప్ప కళా సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందింది. వారణాసిలోని రిలయన్స్ జ్యువెల్స్ స్టోర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫ్యాషన్ ఐకాన్, బాలీవుడ్ దివా దిశా పటానీ ప్రత్యేక ఫెస్టివల్ కలెక్షన్‌ను ఆవిష్కరించారు. హిందూ సంస్కృతిలో శ్రేయస్సు, సమృద్ధిని సూచించే పవిత్ర పండుగ అక్షయ తృతీయ, ఆభరణాలు కొనడానికి సరైన సందర్భమిది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రిలయన్స్ జ్యువెల్స్ వింధ్య కలెక్షన్..మధ్యప్రదేశ్ గొప్ప సాంస్కృతిక వారసత్వం, నిర్మాణ వైభవానికి నివాళి అర్పించే విధంగా అద్భుతమైన ఆభరణాల శ్రేణిని అందిస్తోంది. గ్వాలియర్ కోట, సాంచి స్థూపం, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయం, మితౌలి, బటేశ్వర్ దేవాలయాలు వంటి మధ్యప్రదేశ్లోని ప్రసిద్ధ కట్టడాల స్ఫూర్తితో ప్రతి నగను డిజైన్ చేసినట్లు రిలయన్స్ జ్యువెల్స్ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు.

నామినేషన్ తిరస్కరించిన ఎన్నికల అధికారి

ఆగ్రహంతో ఆందోళన చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి

విశాలాంధ్ర-గుడివాడ : రాజాంగ్రం కల్పించిన హక్కులను కాలరాస్తు గుడివాడ ఎన్నికల అధికారిణి దివ్వంగుడైన నా నామినేషన్ తీసుకోకుండా నును బెదిరించి తానపై క్రిమనల్ కేసు నమోదు చేయిస్తాని అనాడం అన్యామాని కొడాలి వెంకటేశ్వరరావు ఆరోపించాడు. గురువారం స్థానిక అర్‌డివో కార్యాలయంలో నామినేషన్లు అఖరిరోజున గుడ్లవల్లేరు మండలం కుచ్చికాయలపూడికి చెందిన కొడాలి వెంకటేశ్వరరావు విలేకర్లుతో మాట్లాడుతూ తాను స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుక నిర్ణీత సమయంలో స్థానిక ఆర్‌డివో కార్యాలయంలోకి రావడం జరిగిందన్నారు. అనతరం ఎక్కువ మంది నామినేషన్ వేసేందుకు లోపాలికి రాగా పోటీ చేసే అభ్యర్థులకు టోకెన్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. నా పేరు కొడాలి వెంకటేశ్వరరావు అని తెలియడంతో అర్‌డివో, ఎన్నికల అధికారిణి పద్మావతి నీకు టోకెన్ ఇవ్వను అంటు నిరాకరించరన్నారు. అంతే కాకుండా వెంటనే కార్యాలయం నుండి వెళ్ళిపోవాలి లేకుంటే పోలీసుల పిలిచి క్రిమినల్ కేసు నమోదు చేస్తానాని బెదిరించినట్లు తెలిపాడు. తానతో పాటు వచ్చిన లాయర్లు పఠాన్ బాజీఖాన్, ఎం.రాజేష్, బి.వీరయ్య, కె.శివప్రసాద్‌లు, ఈ విషయమై దేనికి నామినేషన్ తిరస్కరిస్తున్నారో తెలిపాలని ఆర్‌డివోను నిలదీయడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారిణి పోలీసులను పిలిచి వెంటనే వీరిని బయటకు పంపించాలని తెలపాడంతో సిఐలు వచ్చి బయటకు వెళ్ళిపోవలని కోరారు. అయితే తమ లాయర్లు కారణం తెలపకుండా బయటకు వెళ్ళామని చెప్పాడంతో మేము ఇప్పుడే ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామాని చెపినప్పటికి బయటకు పంపిచడం జరిగిందన్నారు. ఎమి జరిగిందో తమకు తెలియాదు కానీ బయట ఉన్న నాకు సిఐతో ఫోన్ చేయించి నామినేషన్ వేసేందుకు రావాలని కోరాడంతో నామినేషన్ వేయడం జరిగిందన్నారు. గుడివాడ ఎన్నికల అధికారిణి తన పేరు వైకాపా అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరావుకు పోలి ఉండడంతో, నా నామినేషన్ వేయకుండ వైకాపా ఏజెంట్‌ల ఎన్నికల అధికారిణి వ్యవహరించడం బాదకరమాని కొడాలి వెంకటేశ్వరావు అరోపించారు. గతంలో కూడ నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా పార్వతీ పరమేశ్వరులకు కళ్యాణం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : కరోతి ఇతి శంకరః సకల శుభాలను ఇచ్చే శుభంకరుడు శంకరుడు. ముత్యాలంపాడు శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం జరిగింది. భర్త, భార్య వేరు వేరు కాదని ఒకటే స్వరూపమని, బిడ్డలను రక్షించటంలో పోషించటంలో జననీ జనకుల ఇద్దరి బాధ్యత ఒక్కటేననే అద్వైత తత్వాన్ని తెలియజేసింది పరమేశ్వరుడు. సర్వ ప్రాణుల యందు అణువణువునా నిండిన స్వయం ప్రకాశిక సచ్చిదానందమూర్తి శివుడు. తలదించితే శివం తల ఎత్తితే అనే సత్యాన్ని తెలిపినవాడు మహాదేవుడు అని కళ్యాణానికి విచ్చేసిన భక్తజనులకు తెలుపుతూ వేద పండితులు శైవాగమ శాస్త్ర విధానంతో ఆది దంపతుల కళ్యాణం పెండ్లి పీటలపై కూర్చున్న దంపతులచేత చేయించారు. 24వ తేదీ బుధవారం శ్రీ భవానీ శంకర మరకత శివలింగ వాయు ప్రతిష్ట త్రయాహ్నిక దీక్షతో జరిగింది. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పి గౌతమ్ రెడ్డి, ఉష దంపతులు, మరకత శివలింగ దాత డి లక్ష్మణరెడ్డి, మణి దంపతులచే శాస్త్రోక్తంగా ప్రతిష్ట జరిగింది. కళ్యాణమనంతరం భక్తజనులకు శివపార్వతుల భోజన ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమాన్ని మందిర కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి పర్యవేక్షించగా నిర్వహణ షిరిడి సాయిబాబా భక్తులు, సేవకులు చేశారు.

సంక్షేమ పథకాలు అందాయంటేనే మాకు ఓటేయండి

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ రోజు కంచికచర్ల పట్టణంలోని మోడల్ కాలనీ లో వైయస్సార్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు జగనన్న ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు తాము చేసిన అభివృద్ధి గురించి వివరిస్తూ మీకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాయంటేనే మాకు అవకాశం ఇవ్వాలని అన్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా నాకు, పార్లమెంట్ వైఎస్ఆర్ సీపీ అభ్యర్థిగా కేశినేని నాని కి ఫ్యాన్ గుర్తు కు ఓటు వేసి మమ్ములను గెలిపించి జగనన్న ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు అంశాలే నా అజెండా : కొలికపూడి

విశాలాంధ్ర-తిరువూరు: ఎన్నికల ప్రచార సమయంలో విలేకరుల తో కొలికపూడి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో జగన్ పరిపాలన ఎలా ఉంది అంతకుముందు చంద్రబాబు పరిపాలన ఎలా ఉంది ఈ రెండింటికి వ్యత్యాసం ఏంటి ఎవరి పరిపాలనలో అభివృద్ధి జరుగిందో అని ప్రజలకు కొలికెపూడి శ్రీనివాసరావు తెలియజేస్తున్నాను గడచిన ఐదు సంవత్సరాలుగా తిరువూరు లాంటి పట్నంలో డ్రైనేజీ గాని తాగునీటి సమస్య గాని పరిష్కారం చేయలేదని ఇలాంటి సమస్యలను ఎవరు వస్తే పరిష్కరిస్తారో ప్రజల దగ్గరికి వెళ్లి అవగాహన కల్పిస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టానని కొలికపూడి అన్నారు తిరువూరు పట్టణాన్ని అభివృద్ధి చేసి దిశగా డ్రైనేజీ ,రోడ్లు, ప్రతిరోజు కృష్ణ వాటర్ ను ప్రతి ఇంటికి వచ్చే విధంగా రాబోయే ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి చేస్తానని ప్రతి ఒక్కరిని కలిసి తెలియజేయడం జరుగుతుందన్నారు వచ్చే ఐదు సంవత్సరాల్లో సాగునీరు విద్యా వైద్యం త్రాగునీరు నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేయటం ఈ ఐదు అంశాల కోసం పూర్తిస్థాయిలో పనిచేస్తామని తిరువూరు సమగ్ర అభివృద్ధి కృషిచేస్తానని కొలికపూడి అన్నారు.